JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 26-08-2026
Medchal - Malkajgiri । Wednesday 26-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 86
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 86 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




- భూ సేకరణ వేగవంతం చేయాలి..
- ఫేజ్-2 టెండర్లు త్వరగా పిలవాలి


జయభేరి, హైదరాబాద్:

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రాజెక్టు పురోగతిని సీఎం సమీక్షించారు. భూ సేకరణలో భాగంగా ల్యాండ్ పూలింగ్‌కు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే FTL, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని, భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్ 2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టులో చేపట్టే పనులకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలు పొందే అంశంపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. TDRల జారీపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తక్షణమే టెండర్లు పిలవాలని, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు భూ సేకరణ, ఆర్థిక వనరులు, న్యాయపరమైన అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, HMDA కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, GHMC కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, MRDCL ఎండీ ఈ.వి. నరసింహారెడ్డి, MRDCL జేఎండీ గౌతమి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- మూసీ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి.
- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి.
- FTL, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టమైన విధానం తయారు చేయాలి.
- భూ సేకరణ విషయంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.
- మూసీ ప్రాజెక్టు ఫేజ్-2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలి.
- ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి లభించే రుణాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలి.
- TDRపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలి.
- మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన టెండర్లను తక్షణమే పిలవాలి.
- కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలి.

# వెలిగొండ వెలుగుల దండ



- సర్వం సిద్ధం అయిన వెలిగొండ ప్రాజెక్ట్
- ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాన్న సీఎం
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు
- వెలిగొండ వెలుగుల దండ అంటూ సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల తర్వాత ఇలా.. చంద్రబాబు ఆసక్తికర ట్వీట్


జయభేరి, విజయవాడ, ఆగస్టు 25 :

ఏపీ ప్రభుత్వం వెలిగొండ పూలసుబ్బయ్య ప్రాజెక్ట్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తికాగా, ఇది ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యింది. తాజాగా ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆగస్టు 31న మార్కాపురం జిల్లాలో ఈ ప్రాజెక్టును తన చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి భూ నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం కూడా అందిస్తోంది ఏపీ ప్రభుత్వం . ఇప్పటికి మూడు విడతలుగా పరిహారం అందించింది. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతల్లో 768 కోట్ల రూపాయలను చెల్లించినట్లు ప్రకటించింది. నిర్వాసితులకు ఇస్తామన్న పరిహారం అందించి ప్రాజెక్ట్ ప్రారంభిస్తామని ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి సర్వం సిద్ధం చేసిన సమయంలో చంద్రబాబు ఆసక్తికర ట్వీట్ చేశారు. ...మిగతాది 2 లో

## ఇరాన్‌పై అమెరికా ఆంక్షల్లో చిక్కుకున్న భారతీయ కంపెనీలు
2 లో

# 7 నుంచి అసెంబ్లీ

- కీలక అంశాలపై చర్చకు రంగం సిద్ధం



జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 25 :

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల సమయంలో ఈ సమావేశాలు నిర్వహించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన ...మిగతాది 2 లో




- కులాల గణనలో స్పష్టమైన విధానం అవసరం: కాంగ్రెస్

జయభేరి, న్యూఢిల్లీ:

కులగణన అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. సరైన గణాంకాలు లేకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన విధానాలు పూర్తికావని వారు పేర్కొన్నారు. కులగణనలో ఓపెన్‌ఎండెడ్ ప్రశ్నావళి విధానం గందరగోళానికి దారితీసే అవకాశం ఉందని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే కులాన్ని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషల ఆధారంగా పిలుస్తున్నందున, ఒకే కులానికి చెందిన ప్రజలు వేర్వేరు పేర్లతో నమోదయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో కులాల వాస్తవ జనాభాపై సరైన గణాంకాలు లభించకపోవచ్చని, ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, అణగారిన వర్గాలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. OBCల జనాభా ఎంత అనేది ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఖర్గే, రాహుల్ గాంధీ అన్నారు. విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాల రూపకల్పనకు కచ్చితమైన కుల గణాంకాలు కీలకమని తెలిపారు.

**డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని డిమాండ్**

కులాల కోసం డ్రాప్‌డౌన్ జాబితాను రూపొందించడం సమస్యకు సులభమైన పరిష్కారమని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీ గణనలో అనుసరిస్తున్న విధానాన్ని కులగణనలోనూ ఉపయోగించాలని కోరారు. సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, భారతీయ మానవశాస్త్ర సర్వే వంటి ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఉపయోగించి కులాల జాబితాను రూపొందించవచ్చని తెలిపారు. తెలంగాణ, బిహార్ కుల సర్వేలలోనూ ఇదే విధానాన్ని అనుసరించారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపి కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని మోదీని కోరారు.

# లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- రేవంత్ సర్కార్ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం
- మాజీ మంత్రి హరీశ్ రావు
- సెప్టెంబర్ 7లోగా జీవో రద్దు చేయకపోతే లక్ష మందితో సెక్రటేరియట్ ముట్టడి.
- విద్యార్థులపై పోలీసుల నిర్బంధం దుర్మార్గం..




జయభేరి, హైదరాబాద్:

జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు సంఘీభావం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల వద్దకు చేరుకున్న ఆయన, ఒక ప్రజాప్రతినిధిగానే కాకుండా అదే పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిగా విద్యార్థులకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలన చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకెళ్లి ఐటీఐలతో కలుపుతామంటూ స్కిల్ యూనివర్సిటీకి అప్పగించాలని చూస్తున్నారు. అసలు స్కిల్ యూనివర్సిటీ అనేది పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ పద్ధతిలో నడిచే ఒక ప్రైవేటు సంస్థ. దానికి కేవలం మూడేళ్లు మాత్రమే ప్రభుత్వం మద్దతు ఇస్తుంది, ఆ తర్వాత పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆ యూనివర్సిటీ చట్టంలోనే స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రంలో 113 పాలిటెక్నిక్ కళాశాలలు ఉంటే, అందులో 59 ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారు. దీని వల్ల లక్ష మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతోంది. రేవంత్ రెడ్డికి పిల్లల భవిష్యత్తు కన్నా పాలిటెక్నిక్ ఆస్తుల మీదే కన్ను పడింది. సుమారు వేల కోట్లు విలువ కలిగిన ఆ ప్రభుత్వ భవనాలు, భూములను బ్యాంకుల్లో కుదవపెట్టి అప్పులు తేవడానికే ఈ కుట్రలు చేస్తున్నారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు, రేవంత్ రెడ్డి ...మిగతాది 2 లో

# ఇద్దర్ని తీసేద్దాం..

- కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు సిఫారసు
- పీసీసీ చీఫ్‌కు క్రమశిక్షణ కమిటీ నివేదిక
- హైకమాండ్ ఆదేశాల మేరకు నిర్ణయం






మొదటిపేజీ తరువాయి

## వెలిగొండ వెలుగుల దండ

1996మార్చి 5న ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత మళ్లీ తన చేతుల మీదుగానే ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భగీరథ ప్రయత్నంతో అనేక అడ్డంకులు అధిగమించి ఫేజ్ 1 పూర్తి చేశామని, కరువు నేలకు కృష్ణమ్మ జలాలు అందించబోతున్నామని చెప్పారు.
10.7 టీఎంసీల నీటిని ఈ ప్రాజెక్ట్ ద్వారా నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నారు. ఫేజ్ 1 ద్వారా 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్ 2తో 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. లక్షలాది మందికి తాగునీరు కూడా లభిస్తుంది. దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ వెలుగుల దండగా మారనుందన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కలను నెరవేర్చి మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశామన్నారు. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని ప్రకటించారు. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. 'ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి' అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ వెలిగొండ పూల సుబ్బయ్య ప్రాజెక్ట్ ద్వారా కరువు పీడిత ప్రాంతాలలో పంటలు కళకళలాడనున్నాయి. ముఖ్యంగా ప్రకాశం జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, నెల్లూరు జిల్లాలకు లబ్ది చేకూరనుంది.

## లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

కేవలం భూముల చుట్టే తిరుగుతున్నాడు. పాలిటెక్నిక్ విద్యార్థులు అంటే కేవలం బ్లూ కాలర్ జాబ్స్ చేసేవాళ్లు కాదు, వైట్ కాలర్ జాబ్స్ కూడా చేసే సత్తా ఉన్నవాళ్లు. నేను ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు డిప్లొమా చేసిన వాళ్లు ఏఈ లుగా పనిచేశారు. రాష్ట్రంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, వాటర్ వర్క్స్ ఇంజనీర్లలో సగం మంది మన పాలిటెక్నిక్ విద్యార్థులే. ప్రస్తుతం విద్యార్థులు రూ.15 వేలు ఫీజు కడితే పాలిటెక్నిక్ విద్య పూర్తవుతుంది. ఆ తర్వాత నేరుగా ల్యాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ చదువుకుంటారు. ఇప్పుడు స్కిల్ యూనివర్సిటీలో కలిపితే ఆ ల్యాటరల్ ఎంట్రీ అవకాశాన్ని కోల్పోతారు. ప్రభుత్వ కళాశాలల్లో చదవాల్సిన పిల్లలు ప్రైవేటులోకి ఎందుకు పోవాలి? రేపు స్కిల్ యూనివర్సిటీలోకి వెళ్తే ఫీజులు పెరగవని గ్యారెంటీ ఏంటి? ఫీజు రియంబర్స్మెంట్ వస్తుందా? మూడు సంవత్సరాల తర్వాత మీరే వ్యాపారాలు చేసి కళాశాలలు నడుపుకోండని చట్టంలో చెబుతున్నప్పుడు భవిష్యత్తుకు భరోసా ఎక్కడుంటుంది? ఇది ఒక కళాశాల పోరాటం కాదు, లక్ష మంది విద్యార్థుల పోరాటం. ఢిల్లీలో నీట్ పరీక్షపై జెన్‌జీ తరహా ఉద్యమిస్తే ఏకంగా కేంద్ర మంత్రే రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ చిచ్చు రేపు తెలంగాణలో కూడా రగులుతుంది. గత 20 రోజులుగా జీవో 97 రద్దు చేయాలని పోరాడుతున్న విద్యార్థుల దీక్షకు నా సెల్యూట్. విద్యార్థులపై పోలీసుల ప్రవర్తన అత్యంత దుర్మార్గంగా ఉంది. మహబూబాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఒక విద్యార్థి గొంతును ఓ సీఐ పట్టి పిసికాడు. పాలిటెక్నిక్ విద్యార్థులేమైనా టెర్రరిస్టులా? సూర్యాపేటలో ఒక విద్యార్థిని అరెస్ట్ చేస్తే అమ్మాయిలంతా వెళ్లి పోలీసులను చుట్టుముట్టి విడిపించుకొచ్చారు. జెన్‌జీ అంటే కేవలం రీల్స్, వీడియోలు చేసుకునే వారు కాదు, అవసరమైతే రోడ్డెక్కి భవిష్యత్తును కాపాడుకునే పోరాట యోధులు అని రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకోవాలి. లక్షమంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఒకటై కదిలితే ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌లో అడుగు పెట్టగలరా.. సెప్టెంబర్ 7వ తేదీన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యేలోపు జీవో 97ను రద్దు చేయాలి. లేదంటే లక్ష మంది విద్యార్థులకు అండగా, పూర్వ విద్యార్థిగా బీఆర్ఎస్ పక్షాన నేను ముందుండి పోరాడుతాం. అవసరమైతే అందరినీ కలుపుకుని సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాం. రేవంత్ రెడ్డి కమిటీల పేరుతో డ్రామాలు ఆపాలి. ఇది పోరాడుతున్న విద్యార్థులపై నీళ్లు చల్లి, ఉద్యమాన్ని నీరుగార్చే దొంగ కమిటీ. పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వం ఆధీనంలోనే ఉంచి నడపాలి. భూములు అమ్ముకోవడానికి, కుదవపెట్టడానికి ఉర్దూ యూనివర్సిటీలో 50 ఎకరాలు, హెచ్‌సీయూలో 400 ఎకరాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీలో 200 ఎకరాలు గుంజుకున్నావు. టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, హౌసింగ్ బోర్డు ఆస్తులు సరిపోలేదా రేవంత్ రెడ్డి? ఇప్పుడు పాలిటెక్నిక్ ఆస్తులు కావాలా? ఢిల్లీలో, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాగే పాలిటెక్నిక్ కళాశాలలను యూనివర్సిటీల్లో కలపాలని చూసి ఫెయిల్ అయ్యారు, తిరిగి ఉపసంహరించుకున్నారు. ఇక్కడ కూడా తక్షణమే జీవోను రద్దు చేయాలి. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ కింద మూడు రూపాయలు ఇవ్వడం చేతకాని రేవంత్ రెడ్డి, రేపు ప్రైవేటు యూనివర్సిటీలో రక్షణ కల్పిస్తాడంటే నమ్మకం ఏంటి.. ఈ ప్రభుత్వంలో ఒక మంత్రి మాట్లాడుతూ.. రేపు మా ప్రభుత్వం వస్తుందో లేదో, నేనే మళ్లీ గెలుస్తానో లేదో గ్యారెంటీ లేదు అని స్వయంగా అన్నారు. ఏ మంత్రి ఏం మాట్లాడుతున్నాడో, ఎవరికి ఏ నోటీసులు వస్తాయో, అసలు ఈ గవర్నమెంట్ ఎన్ని రోజులు ఉంటుందో వాళ్లకే నమ్మకం లేదు. ఇక పీపీపీ యూనివర్సిటీ కింద విద్యార్థుల భవిష్యత్తుకు వీళ్లేం గ్యారెంటీ ఇస్తారు.. ఈ నిరుద్యోగులు, విద్యార్థులు ప్రభుత్వానికి శత్రువులు కాదు. విద్యార్థులారా.. మీ హక్కుల కోసం బహిరంగంగా పోరాడండి. జెన్‌జీ సత్తా ఏమిటో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలిసొచ్చేలా చేయండి, మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. నేను, కేటీఆర్ విదేశాలకు వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తుందంటూ సీఎం రేవంత్ రెడ్డి కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ఆయన తలకాయ్ ఉండి మాట్లాడుతున్నారో, లేక అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. నేను గానీ, కేటీఆర్ గానీ కేవలం ఎమ్మెల్యేలం మాత్రమే. ఒక ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లడానికి కేంద్రానికి ఎలాంటి దరఖాస్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. కేవలం ముఖ్యమంత్రి లేదా కేంద్ర మంత్రుల హోదాలో విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. ఈ కనీస విషయం కూడా తెలియకుండా పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆగం చేయొద్దని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నాం.

## 7 నుంచి అసెంబ్లీ

నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశం ఉందని తెలుస్తోంది.మరోవైపు, ప్రజా సమస్యలు, హామీల అమలు, భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరుగుతుందా అని ఆసక్తి నెలకొంది. రైతులకు ప్రాజెక్టుల నుంచి సాగునీటిని సకాలంలో విడుదల చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసినవి ఆరోపణలేనని నిలదీసేందుకు కేటీఆర్, హరీష్‌రావు టీం ప్లాన్ చేయనుంది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కాలేజీల సమస్యలు, సభలో నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లగా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, అమెరికా పర్యటనకు మాత్రం కొర్రీలు పెట్టడాన్ని తప్పుపట్టారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాలకు సంబంధించి పెట్టుబడులు, అంతర్జాతీయ సహకారం ఆకర్షించడమే లక్ష్యంగా విదేశీ పర్యటన కోసం విదేశాంగ శాఖకు ముందే పూర్తి వివరాలు సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చినప్పటికీ, దురదృష్టవశాత్తూ అమెరికా పర్యటనకు మాత్రం నిరాకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు సులభంగా అనుమతులు ఇచ్చి, తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "కేంద్రం భౌతికంగా నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనలను, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలను కాదనలేదు" అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తన వ్యక్తిగత అవమానం కాదని, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారని గుర్తుచేశారు. రైజింగ్ తెలంగాణ 2047 ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకుంటే, కేంద్రంలోని బీజేపీ నేతలు విచక్షణ మరిచిపోయి ఈ అధికారిక పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, రెండు ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధుల మధ్య ఫెడరల్ సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# ఇరాన్‌పై అమెరికా ఆంక్షల్లో చిక్కుకున్న భారతీయ కంపెనీలు




### సంపాదకీయం



మోతె రఘు తిరుపతి రెడ్డి
ఎడిటర్, 'జయభేరి' దినపత్రిక

అమెరికా-ఇరాన్ మధ్య ఆర్థిక, భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపం దాల్చుతున్న వేళ.. ఆ ప్రభావం భారత్ వాణిజ్య రంగానికీ తాకింది. ఇరాన్‌తో చమురు, పెట్రోకెమికల్స్ వ్యాపార సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో నాలుగు భారతీయ కంపెనీలపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. అమెరికా ప్రకటించిన "ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్"లో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆంక్షలు ఎదుర్కొంటున్న భారతీయ సంస్థల్లో సదాశివ ఓవర్సీస్ లిమిటెడ్, పీపీ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రకృతీస్ ఇన్‌ఫ్రా ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అలాగే కస్టమ్స్ బ్రోకర్ సంస్థ పోర్టేజ్ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీ ఉన్నాయి. అమెరికా వాదన ప్రకారం.. ఈ సంస్థలు ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తుల దిగుమతులు లేదా సంబంధిత వాణిజ్య, మధ్యవర్తిత్వ కార్యకలాపాల్లో పాల్గొన్నాయి.

**అసలు సమస్య ఏమిటి?**

ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొత్తవి కావు. అయితే ఈసారి వాటి పరిధిని మరింత విస్తరించాలన్నది వాషింగ్టన్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇరాన్‌కు చమురు ద్వారా వచ్చే ఆదాయాన్ని అడ్డుకోవడంతో పాటు.. ఆ దేశంతో వ్యాపారం చేసే మూడో దేశాల సంస్థలపైనా ఒత్తిడి తీసుకురావాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఇదే భారత్‌కు అసలు సవాలు. ఇరాన్‌తో భారత్‌కు చారిత్రకంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంధనం, బియ్యం, టీ, ఔషధాలు వంటి రంగాల్లో వ్యాపారం కొనసాగుతోంది. అయితే అమెరికా ఆంక్షలు, మరోవైపు యూఏఈ ద్వారా ఇరాన్‌తో జరిగే ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఆంక్షలు.. భారతీయ వ్యాపారాలకు చెల్లింపులు, రవాణా, బీమా వంటి అంశాల్లో కొత్త ఇబ్బందులను సృష్టించే అవకాశం ఉంది.

**నాలుగు కంపెనీలకు పరిమితమేనా?**

ఇది కేవలం నాలుగు సంస్థల సమస్యగా చూడటం సరైంది కాదు. అమెరికా "సెకండరీ సాంక్షన్స్" విధానాన్ని మరింత కఠినతరం చేస్తే.. ఇరాన్‌తో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యాపారం చేస్తున్న మరిన్ని భారతీయ సంస్థలు కూడా అప్రమత్తం కావాల్సి ఉంటుంది. అమెరికా ఆంక్షల ప్రభావం అంటే కేవలం అమెరికా మార్కెట్‌ను కోల్పోవడమే కాదు. డాలర్ ఆధారిత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్, చెల్లింపులు, బీమా, షిప్పింగ్ వంటి సేవలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది.

**భారత్ ముందున్న దౌత్య పరీక్ష**

ఇక్కడే న్యూఢిల్లీకి అసలు పరీక్ష మొదలవుతుంది. ఒకవైపు అమెరికాతో భారత్‌కు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు అత్యంత కీలకం. మరోవైపు ఇరాన్ భారత్‌కు మధ్య ఆసియా, యూరప్ మార్కెట్లకు అనుసంధానంలో భౌగోళికంగా ముఖ్యమైన భాగస్వామి.
చాబహార్ పోర్ట్ వంటి ప్రాజెక్టులు కూడా ఈ సంబంధాల ప్రాధాన్యతను చూపిస్తాయి. అందుకే అమెరికా ఆంక్షలను పూర్తిగా విస్మరించడం భారత్‌కు సాధ్యం కాదు. అదే సమయంలో ఇరాన్‌తో ఉన్న వ్యూహాత్మక ప్రయోజనాలను వదులుకోవడం కూడా అంత సులభం కాదు.

**ముందున్న దారి..**

ఈ పరిణామం భారతీయ కంపెనీలకు ఒక స్పష్టమైన హెచ్చరిక. అంతర్జాతీయ వాణిజ్యంలో ఒక దేశంతో చేసే లావాదేవీ ప్రభావం మరో దేశంలోని మార్కెట్, బ్యాంకింగ్ వ్యవస్థలపైనా పడవచ్చు. ఇకపై ఇరాన్‌తో వ్యాపారం చేసే భారతీయ సంస్థలు అమెరికా ఆంక్షల నిబంధనలు, చెల్లింపు మార్గాలు, షిప్పింగ్ నిబంధనలు, భాగస్వామ్య సంస్థల నేపథ్యాన్ని మరింత జాగ్రత్తగా పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి.. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఇప్పుడు కేవలం అమెరికా-ఇరాన్ సమస్యగా మిగలలేదు. వాటి ప్రభావం భారత్ వాణిజ్యం, ఇంధన భద్రత, దౌత్య సమతుల్యతపై కూడా పడే అవకాశం ఉంది. నాలుగు భారతీయ కంపెనీలపై పడిన ఈ ఆంక్షలు.. రాబోయే రోజుల్లో మరింత విస్తృత ఆర్థిక ఒత్తిడికి సంకేతమా అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

## గ్రూప్ తగాదాలు కు ఫుల్ స్టాప్ పడినట్టేనా..

# ఇంట్లో ఈగల మోత...

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 25 :



లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విమానాశ్రయం నుంచే అసలైన రాజకీయ సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. ప్రభుత్వం సజావుగా సాగుతోందనుకుంటున్న తరుణంలో.. సొంత పార్టీకి చెందిన సీనియర్ మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబంపైనే గురిపెట్టి సంచలన ఆరోపణలు చేయడం అధికార కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇప్పటికే పీసీసీ డిసిప్లినరీ కమిటీ ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, రేవంత్ రెడ్డి నేరుగా నగరంలో అడుగుపెట్టిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయం అత్యంత కఠినమైనదిగానూ, పార్టీ భవిష్యత్తును శాసించేదిగానూ మారనుంది.కొండా సురేఖ వ్యవహారాన్ని తేల్చడం అందరూ అనుకుంటున్నట్లు రేవంత్ రెడ్డికి అంత తేలికైన విషయమేమీ కాదు. కొండా కుటుంబం ఈ వివాదంలో మొదటి నుంచీ బీసీ కార్డు ను బలంగా ప్రయోగిస్తోంది. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, బీసీ వర్గానికి చెందిన ఒక మహిళా మంత్రిపై వేటు వేస్తే.. అది ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపిలకు పెద్ద రాజకీయ ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. పైగా సురేఖను తొలగిస్తే తప్పనిసరిగా తక్షణమే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టాల్సి వస్తుంది.
ప్యాక్ అయిన మంత్రివర్గంలో ఇప్పటికే పదవుల కోసం తీవ్ర పోటీ పడుతున్న అనేకమంది సీనియర్ నాయతెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం పైకి ఎదురుదెబ్బగా కనిపించినప్పటికీ, వ్యూహాత్మకంగా ఆయన రాజకీయ పరిస్థితుల్ని చక్కదిద్దుకోవడానికి లభించిన సువర్ణావకాశంగా కనిపిస్తోంది. సుమారు పది రోజుల పాటు సాగే సుదీర్ఘ విదేశీ పర్యటనలో భాగంగా సీఎం హైదరాబాద్‌ను వీడగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దూరంగా ఉన్న సమయంలో తలెత్తిన సంక్షోభం మరింత ముదరకుండా ఉండాలంటే ఆయన రాష్ట్రంలో ఉండటం అత్యవసరమైంది. ఈ పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయం ఆయన వెంటనే స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఒక బలమైన రాజకీయ కారణాన్ని సమకూర్చింది.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి స్వరం వినిపించడం, కొంతమంది ఎమ్మెల్యేలతో ప్రత్యేక మంతనాలు సాగిస్తున్నారనే ప్రచారం తెరపైకి రావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. సరిగ్గా ఇదే సమయంలో వరంగల్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. మంత్రి వ్యాఖ్యలపై దాదాపు 20 మందికి పైగా శాసనసభ్యులు తిరుగుబాటు జెండా ఎగరేయడం, సీఎల్పీ వేదికగా మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో సంక్షోభం తారాస్థాయికి చేరింది. సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో లేకపోతే ఈ గ్రూపు రాజకీయాలు పార్టీ ఉనికికే చేటు తెచ్చే ప్రమాదం ఏర్పడింది.పర్యటన మధ్యలోనే ఆపేసి వస్తే రాష్ట్రంలో తిరుగుబాటుకు భయపడి రేవంత్ పర్యటన రద్దు చేసుకున్నారు అనే ప్రతిపక్షాల విమర్శలను కేంద్రం తీసుకున్న నిర్ణయం పూర్తిగా తుడిచిపెట్టేసింది.
విదేశాంగ శాఖ క్లియరెన్స్ నిరాకరించడాన్ని సీఎంవో సమర్థవంతంగా తమ అనుకూల అంశంగా మలుచుకుంది. నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల కోసం వెళ్తున్న ముఖ్యమంత్రిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకుందనే వాదనను తెరపైకి తెచ్చి ప్రజల్లో సానుభూతిని, తెలంగాణ హక్కుల పోరాట భావజాలాన్ని బలంగా వినిపించేందుకు రేవంత్‌కు వీలు చిక్కింది. ఇది ఆయన వైపు నుంచి బలమైన రాజకీయ రక్షణ కవచంగా మారింది.
లండన్‌లో ఉన్న సమయంలోనే రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తన వ్యూహాలకు పదును పెట్టారు. అసంతృప్త నేతలను దారికి తెచ్చేందుకు, గ్రూపు తగాదాలకు చెక్ పెట్టేందుకు హైకమాండ్ సహకారంతో పూర్తి కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఒకవైపు సొంత పార్టీలో క్రమశిక్షణను పునరుద్ధరించడం, మరోవైపు కేంద్రంపై రాజకీయ దాడిని ఉధృతం చేయడం అనే ద్వంద్వ వ్యూహాన్ని రేవంత్ ఖరారు చేశారు. ఢిల్లీ లేదా రాష్ట్రస్థాయిలో తన నాయకత్వానికి ఎదురులేదని నిరూపించుకునేందుకు ఈ పరిణామాలను ఒక అవకాశంగా మార్చుకున్నారు. అమెరికా పర్యటన యథావిధిగా కొనసాగి ఉంటే హైదరాబాద్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం మరింత విస్తరించి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారేది. ఆ రకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం అనేది రేవంత్ రెడ్డికి రాజకీయ నష్టం కలిగించకపోగా, తన అంతర్గత వ్యతిరేకులను కట్టడి చేసి ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తి నియంత్రణలోకి తెచ్చుకోవడానికి మార్గాన్ని సుగమం చేసింది. కాలం కలిసి రావడం అంటే ఇదే అనుకోవచ్చేమో. అలాగని ఈ వ్యవహారాన్ని నర్మగర్భంగా వదిలేసి, ఉపేక్షిస్తే వచ్చే నష్టం ఇంకా తీవ్రంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి ఉదారంగా ఉంటే.. పార్టీలో క్రమశిక్షణ పూర్తిగా తప్పుతుందనే సంకేతాలు వెళ్తాయి. సురేఖ కుమార్తె సీఎం కుటుంబంపై చేసిన ల్యాండ్ డీల్ ఆరోపణలు, షెల్ కంపెనీల వ్యాఖ్యలను ఉపేక్షిస్తే, భవిష్యత్తులో మరికొందరు అసమ్మతి నాయకులు సైతం రేవంత్ కుటుంబంపై బహిరంగంగా రాళ్లు వేయడానికి వెనుకాడరు. నైతిక స్థైర్యాన్ని, కమాండ్‌ను కాపాడుకోవాలంటే కఠిన చర్యలు తప్పవనే ఒత్తిడి పార్టీ హైకమాండ్ , మంత్రివర్గ సహచరుల నుంచి రేవంత్ పై తీవ్రంగా ఉంది.ఇక్కడే రేవంత్ రెడ్డి అత్యంత క్లిష్టమైన లీడర్‌షిప్ టెస్ట్ ను ఎదుర్కొంటున్నారు. కేవలం క్రమశిక్షణా చర్యలతో సరిపెడతారా లేదా మంత్రివర్గం నుంచే సాగనంపి తన అధికారాన్ని, ఆధిపత్యాన్ని చాటుకుంటారా అన్నది ఉత్కంఠగా మారింది. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రేవంత్ రెడ్డి తీసుకొనే సంచలనాత్మక నిర్ణయాలే.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతిని అణచివేస్తాయా లేక కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు దారితీసి కొత్త సమీకరణాలకు తెరతీస్తాయా అనేది తేలనుంది. లండన్ నుంచి వచ్చిన రేవంత్ చూపే పొలిటికల్ మార్క్ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్.

# ఇద్దర్నీ తీసేద్దాం..!

- కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు సిఫారసు
- పీసీసీ చీఫ్‌కు క్రమశిక్షణ కమిటీ నివేదిక
- హైకమాండ్ ఆదేశాల మేరకు నిర్ణయం



జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 25 :

మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డిపై వేటు వేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ఇటీవలి వ్యవహారాలను తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చినట్టు లీకులు ఇస్తుండగా, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. కాగా, వారిద్దరిపై పూర్తి అంశాలతో నివేదికను పొందుపరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌కు ఇచ్చినట్టు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్‌మోహన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలతోపాటు గత విషయాలను కూడా పరిగణనలోకి తీసుకొని నివేదిక తయారుచేశామని చెప్పారు. ఈ రిపోర్ట్‌ను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపుతామని, కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని వెల్లడించారు. ఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. అయితే ఆ నివేదికలో ఏముందో చెప్తే తనకు నోటీసులు వస్తాయని చెప్పారు. పార్టీపై వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# ప్రజలను ఇంతలా వేధిస్తారా?

- లక్షలాది ప్రజల ఆస్తులు రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి!

జయభేరి, కుత్బుల్లాపూర్ :




కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆధ్వర్యంలో 22A నిషేధిత భూముల బాధిత కుటుంబాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకొని బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చాను. 98 శాతం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారు? 22ఏ జాబితాలో పెట్టడం ప్రభుత్వం చేసిన తప్పు. ఆ తప్పును సరిదిద్దుకోవడానికి దరఖాస్తుల పేరుతో కార్యాలయాల చుట్టూ సామాన్య ప్రజలు ఎందుకు తిరగాలి? లక్షలాది ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టి వాళ్లకు కంటి మీద కునుకు లేకుండా చేసి ప్రజలను శిక్షిస్తారా?

58 ఏళ్ల క్రితం ఏర్పడిన పద్మారావు నగర్ ఫేజ్ 1, 1950ల నాటి స్ప్రింగ్ ఫీల్డ్, నిజాంపేట్ లాంటి కాలనీల్లోని దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను కూడా 22ఏలో చేర్చడం తుగ్లక్ చర్య కాక మరేమిటి.. ప్రభుత్వంలో పని కావాలంటే లంచాలు చెల్లించాల్సిందే అన్నట్లుగా ముఖ్యమంత్రి, పొంగులేటి ఏజెంట్లు వసూళ్లకు దిగారు. మహబూబ్ నగర్‌కు చెందిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో విల్లాకు, ఫ్లాట్‌కు 30 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే పని అవుతుందని బాధితులు బహిరంగంగానే వాపోతున్నారు. అమీన్‌పూర్ నుంచి వచ్చిన ఒక బాధితుడిని ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ అంటూ చుట్టూ తిప్పించుకుని.. చివరకు బయట బ్రోకర్లను కలిస్తేనే పని అవుతుందని పరోక్షంగా బెదిరిస్తున్నారు. ఈ 22ఏ కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉంది. దీనికి ఏ1 రేవంత్ రెడ్డి, ఏ2 పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. 5050 కమీషన్ల కోసమే ఈ దోపిడీ అంతా జరుగుతోంది. తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా తెలుసు అని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటారు. ఆ వ్యాపారం తెలిస్తే ప్రజల కష్టాలు తీర్చాలి కానీ, వాళ్ల రక్తం పీల్చి పిప్పి చేస్తారా? రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు చివరికి పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారు.

ఇలా అమ్ముకుంటూ పోతే రేపు గుడికో, బడికో.. చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే కంచే చేను మేసినట్లుగా తయారై ఆస్తులను లాక్కుని ఆగం చేస్తోంది. ఈ కాంగ్రెస్ పాలనలో లా అండ్ ఆర్డర్ లేకుండా పోయింది. ఆడపిల్లల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కరువైంది. ఈ సమస్య కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములను కూడా 22ఏలో పెట్టారు. మల్కాజిగిరిలో 22ఏ భూములపై నేను మాట్లాడినప్పుడు, అక్కడికొచ్చిన వారి పేర్లు రాసుకుని వారి భూములను జాబితా నుంచి తొలగించారు. అలాగే తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితుల వివరాలు తీసుకుని జాబితా నుంచి తీసేశారు. అంటే బీఆర్ఎస్ పోరాటం వల్లే ప్రభుత్వంలో ఈ మాత్రం కదలిక వస్తోంది.

ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. ప్రజల కష్టాలు ఎక్కడుంటే అక్కడ పార్టీ అండగా నిలబడుతుంది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే.. దద్దరిల్లేలా సభను స్తంభింపజేసి అయినా బాధితుల సమస్యలు పరిష్కారం అయ్యేలా కొట్లాడుతాం. భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో విచారణ జరగాలి. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం. నిషేధిత జాబితాను సీక్రెట్‌గా ఎందుకు ఉంచుతున్నారు.. వెబ్‌సైట్‌లో జాబితాను ఎందుకు బ్లాక్ చేశారు? ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ప్రజల భూములతో చెలగాటమాడుతూ వారిని నిద్ర లేకుండా చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలి.




## హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రెండు ఓపెన్ జిమ్‌ల ప్రారంభం

జయభేరి, ఉప్పల్ :

హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో ప్రజల ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే దిశగా మరో ముందడుగు పడింది. అన్నపూర్ణ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, అలాగే సరస్వతి నగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఉప్పల్ శాసనసభ్యులు బండారి గారు స్థానిక బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హెచ్ఎంటీ నగర్, నాచారం డివిజన్లలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిధులు మంజూరు చేయిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ని కలిసిన శంకర్ స్వామీజీ



జయభేరి, దేవరకద్ర :

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పరమ పూజ శ్రీమాన్ యోగి ఆదిత్యనాథ్ మహారాజ్ ను శంకర్ స్వామీజీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణకు చెందిన శంకర్ స్వామీజీ అయోధ్యలో జరిగే పూజా కార్యక్రమానికి హాజరు కావడానికి బయలుదేరి వెళ్లారు. అయితే లక్నో లో ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మహారాజ్ ను ఆయన నివాసంలో శంకర్ స్వామీజీ కలిశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం, సమాజంలో సమరసతను సాధించడం కోసం ముందుకు సాగాలని ఆశీర్వదిస్తూ శంకర్ స్వామీజీకి ముఖ్యమంత్రి సనాతన ధర్మ రక్ష దీక్ష వస్త్రాన్ని అందించారు. స్వామీజీని కలిసిన వారిలో చత్రపతి శివాజీ పీఠం అధ్యక్షుడు బైలూరి యోగేష్ ప్రభు, వేదిక సైంటిస్ట్ చిరంజీవి సుఖేష్ శర్మ తదితరులు ఉన్నారు.



## ప్రజా పాలనలో.. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

- దేవరకద్ర డైనమిక్ ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారంధ్యంలో దీనికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలైన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కి గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత కరెంటు, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా, ఆసరా పింఛను, సీఎంఆర్ఎఫ్ ఆరోగ్య సహాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పావలా వడ్డీ రుణాలు, మహిళలకు పెట్రోల్ బంకులు పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది అన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.

## ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన రాజమూరి శ్రీనివాస్



జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లోని గాంధీభవన్ లో మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ సావంత్ ను రాష్ట్ర ఓబిసి వైస్ చైర్మన్, మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర కు చెందిన రాజమూరి శ్రీనివాస్ (టీసి) మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్ నగర్ ఓబిసి పరిశీల పరిశీలకుడు గుంద్రాతి కిరణ్ తేజ గౌడ్ తో కలిసి శ్రీనివాస్ ఆయనను కలిశారు. అలాగే రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ను కూడా వారు కలిశారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

జయభేరి, ఖమ్మం

వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. 13 మంది విద్యార్థులు అల్పాహారం తిన్న కొద్దిసేపటికి కడుపు నొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను చికిత్స నిమిత్తం సిబ్బంది ఆసుపత్రికి తరలించారు.

## మన్యంకొండలో వీరభద్ర స్వామి అఖండ దీపారాధన ప్రారంభం

- చైర్మన్ మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు
- 41 రోజుల పాటు కొనసాగునున్న అఖండ దీపారాధన

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన క్షేత్రపాలకుడు శ్రీ వీరభద్ర స్వామి అఖండ దీపారాధన పవిత్ర పూజా కార్యక్రమాన్ని సోమవారం రాత్రి ప్రారంభించారు. ప్రతి ఏడాది శ్రావణమాసం 2వ సోమవారం వీరభద్ర స్వామి అఖండ దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ రీతిలో ప్రారంభించారు. దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ అఖండ దీపారాధన మహోత్సవానికి ప్రత్యేక పూజలు చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో స్వామి వారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. 41 రోజులపాటు ఈ అఖండ దీపారాధన నిర్వహించి ఆ తర్వాత వచ్చే సోమవారం రోజు వీరభద్ర స్వామి అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీంతో దేవాలయంలో అఖండ దీపారాధన కార్యక్రమం ముగియనుంది. అప్పటివరకు దేవాలయములో ప్రతిరోజు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ లతోపాటు ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన అర్చకులు రాజేష్, నరసింహయ్య లతోపాటు దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఓరియంటేషన్ డే

జయభేరి, దేవరకొండ :



మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), దేవరకొండలో ప్రథమ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా "ఓరియంటేషన్ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ విద్యా విధానం, అకాడమిక్ కార్యకలాపాలు, కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ వనరులు, నియమ నిబంధనలు, విద్యార్థుల బాధ్యతలు తదితర అంశాలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఉన్నత విద్య అనేది కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి మాత్రమే కాకుండా, జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే ముఖ్యమైన దశ అని పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి గది బోధనతో పాటు గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ వనరులు, సాంకేతిక సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.అలాగే సమయ పాలన, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావడం, కళాశాల ప్రాంగణంలో క్రమశిక్షణ పాటించడం, అధ్యాపకులు మరియు తోటి విద్యార్థులను గౌరవించడం, వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల హక్కులతో పాటు వారి బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థుల విద్యా ప్రగతికి అనుసరించే అకాడమిక్ విధానం, తరగతుల నిర్వహణ, హాజరు, అంతర్గత మూల్యాంకనం, పరీక్షా విధానం, అసైన్‌మెంట్లు, సెమినార్లు, ప్రాజెక్టులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.కోటయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ డా. కె.పృథు, డా.ఎం. ప్రభాకర్, డా.వి. మకట్లాల్, డా.కె.రేణుక తదితర అధ్యాపకులు, ప్రథమ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 165 రకాల సీతాకోకచిలుకలు..

- జీవవైవిధ్యం అద్భుతమంటూ అసోం సీఎం హిమంత కీలక పోస్ట్

జయభేరి, హైదరాబాద్ :

అసోంలోని దెహింగ్ పట్కాయ్ ప్రాంతం అరుదైన జీవవైవిధ్యానికి నిలయంగా మారిందని, ముఖ్యంగా అంతరించిపోతున్న సీతాకోకచిలుకలకు సురక్షిత ఆవాసంగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 165 రకాల సీతాకోకచిలుక జాతులు ఉన్నాయని, వాటిలో 37 అత్యంత అరుదైన జాతులు ఉన్నాయని మంగళవారం ఆయన వెల్లడించారు.ఈ అద్భుతమైన జీవవైవిధ్యంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ముఖ్యమంత్రి స్పందించారు. 'సీతాకోకచిలుక, ఎగిరిపో...' అంటూ తన పోస్టులో పేర్కొంటూ, ఈ ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను ఆయన కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న పటిష్ఠ పరిరక్షణ చర్యల వల్లే అరుదైన జాతులు ఇక్కడ వృద్ధి చెందుతున్నాయని, వాటికి అనువైన, సురక్షితమైన ఆవాసం లభిస్తోందని ఆయన వివరించారు

పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని సూచించే కీలక జీవులుగా సీతాకోకచిలుకలను పరిగణిస్తారు. వృక్షసంపద, వాతావరణం, సహజ ఆవాసాల స్థితిగతులపైనే వీటి జనాభా ఆధారపడి ఉంటుంది. దెహింగ్ పట్కాయ్‌లో ఇంత పెద్ద సంఖ్యలో సీతాకోకచిలుకలు మనుగడ సాగించడం అక్కడి పర్యావరణ సమతుల్యతకు నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో అసోం ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర సహజ సంపదను కాపాడే క్రమంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. దెహింగ్ పట్కాయ్ జీవవైవిధ్య విలువను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన సందేశం ద్వారా పునరుద్ఘాటించారు

## పోచమ్మ తల్లి.. దీవించు..

- పుట్టపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు
- అర్చకుడు మఠం సురేష్ స్వామి అద్వర్యంలో పూజలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పుట్టపల్లి లో మంగళవారం గ్రామ దేవత పోచమ్మ బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది అమ్మవారి బోనాల పండుగ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మఠం సురేష్‌స్వామి అద్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అమ్మవారికి కాయ కర్పూరాల తో పాటు నైవేద్యాలు సమర్పించారు. అంతేకాకుండా మహా మంగళ హారతి తో పాటు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకద్రలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

- దేవరకద్రలో వనమహోత్సవం
- మొక్కలు నాటిన మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కమిషనర్ నరేష్ బాబులతోపాటు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక విజన్ 2047 కార్యాచరణ సిద్ధం

- 2047 నాటికీ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ల ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి.

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి.**




తెలంగాణను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంతో పాటు, 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడంలో పర్యాటక రంగాన్ని కీలక భాగస్వామిగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. మంగళవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి పర్యాటక ప్రాంతాలు గుర్తింపు, విజన్ 2047 కార్యాచరణ అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈ లక్ష్యసాధనలో భాగంగా రూపొందించిన తెలంగాణ టూరిజం విజన్ 2047' కార్యాచరణ ప్రణాళికలో పర్యాటకుల అనుభూతిని మెరుగుపరచడం, స్థానిక ప్రాంతాల ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచి, ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని తెలిపారు. హోమ్‌స్టేలు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్ల ద్వారా స్థానికులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచనున్నట్లు తెలిపారు. ఏఐ ఆధారిత ఇటినరరీ ఇంజిన్, 'తెలంగాణ పాస్' డిజిటల్ వాలెట్, రియల్‌టైమ్ డేటా డ్యాష్‌బోర్డుల ద్వారా పర్యాటకులకు ఆధునిక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు బతుకమ్మ, బోనాలు, మేడారం జాతర వంటి ప్రత్యేక ఉత్సవాలను గ్లోబల్ ఈవెంట్లుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత, కార్బన్‌న్యూట్రల్ పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించి సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ 100 వీకెండ్ గేట్‌వే గమ్యస్థానాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని పాండవులగుట్ట, ఘన్‌పూర్ గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ (కోటగుళ్లు), శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, రెడ్డి గుడి, సావత్‌భద్ర ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, ముడుగుల్ల దేవాలయం వంటి ప్రాంతాలను వారాంతపు పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేసే అవకాశాలను ప్రణాళికలో గుర్తించామని తెలిపారు. ఈ ప్రాంతాలకు సమీపంలోని రామప్ప ఆలయం, రామప్ప సరస్సు, లక్నవరం సరస్సు, వేయి స్తంభాల ఆలయం, మైలారం గుహలు, ఘన్‌పూర్ సరస్సు, నైనపాక, కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, గట్టమ్మ ఆలయం, కాళేశ్వరం త్రికూట ఆలయ సముదాయం వంటి పర్యాటక ప్రాంతాలను అనుసంధానించడం ద్వారా సమగ్ర టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యావరణ, జలపాతాలు, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. యాదాద్రి, భద్రాచలం, వేములవాడ, రామప్ప, అలంపూర్, చార్మినార్, గోల్కొండ, కుంటాల జలపాతం, బౌద్ధ పర్యాటక ప్రాంతాలు ఇందులో కీలకంగా ఉన్నాయని వివరించారు.

**సురక్షితమైన పర్యాటకానికి ప్రోత్సాహం**

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ 'మహిళా మిత్ర' నెట్‌వర్క్, అత్యవసర పానిక్ బటన్లు, సీసీటీవీ నెట్‌వర్క్ వంటి సదుపాయాలను విస్తరించనున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చార్మినార్ నుంచి గోల్కొండ వరకు 'హైదరాబాద్ ఆఫ్టర్ డార్క్ మైల్', నైట్ బజార్లు, ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా పర్యాటక వ్యవస్థను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ప్రజా భాగస్వామ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక సంస్కృతి-సంప్రదాయాలను సమన్వయం చేస్తూ తెలంగాణను దేశంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా, అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే 'తెలంగాణ టూరిజం విజన్ 2047' ప్రధాన లక్ష్యమని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఐడిఓసి కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, విజయలక్ష్మి, పర్యాటక అధికారి రఘు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించిన టీఎస్ యుటిఎఫ్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీపీ ఎస్ (హెచ్ డబ్ల్యు) పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు రమాదేవిని టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. ప్రధానోపా ధ్యాయురాలు రమాదేవి పదవీ విరమణ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో వీరు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్,ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ (టీఎస్ యుటిఎఫ్) కార్యదర్శి అజయ్ దేవరకద్ర మండల ప్రధాన కార్యదర్శి డి.కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వేణుగోపాల్ ప్రసంగించారు. ప్రధానోపా ధ్యాయురాలు రమాదేవి విధుల పట్ల చాలా అంకితభావంతో పనిచేసేవారని కొనియాడారు. 2024 జులైలో జరిగిన బదిలీలో ఈ మండలానికి ఆమె రావడం జరిగిందన్నారు. ఆ వినతి కాలంలోనే మండలంలోని అందరు ఉపాధ్యాయుల అభిమానాలను ఆమె చూరగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బలరాం, కోయిల్ సాగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కే.రమేష్‌నాయక్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ నర్సింగ్ కాలేజీలో ఘనంగా ఓనం వేడుకలు




**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 25:**

సీఎంఆర్ నర్సింగ్ కాలేజీలో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రకరకాల సంప్రదాయ వంటకాలను తయారు చేసి ఓనం పండుగ ప్రత్యేకతను చాటారు. కళాశాల చైర్మన్ సి. గోపాల్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఓనం పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సి. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "ఓనం పండుగ కేరళ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ప్రేమ, సోదర భావం, ఐక్యత, సంతోషాన్ని పంచుకోవడమే ఈ పండుగ ప్రధాన సందేశం. విద్యార్థులు చదువుతో పాటు మన దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు, మన సంస్కృతిపై అవగాహన కలిగిస్తాయి. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, అభివృద్ధి కలగాలని కోరుకుంటున్నాను" అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ ప్రిన్సిపాల్ పి. శ్రీలేఖ, మేనేజర్ జే. దుర్గా ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మురహరిపల్లి వార్డులో ఘనంగా వనమహోత్సవం

- జీనోమ్ వ్యాలీలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 25:**

వనమహోత్సవం-2026లో భాగంగా ఆలియాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మురహరిపల్లి వార్డు పరిధిలోని జీనోమ్ వ్యాలీలో మంగళవారం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కన్ రెడ్డి మాలతి మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. మెడిసిటీ ఆసుపత్రికి చెందిన వైద్యులు, నర్సులు సైతం కార్యక్రమంలో పాల్గొని పచ్చదనం పెంపునకు తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టణాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో తీర్చిదిద్దేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాదె వెంకటేష్, హపావత్ వెంకటేష్, గురుకుల దీప, యూసుఫ్ బాబా, జశ్వంత్ రెడ్డి, వి. శ్యామ్, ఎల్లూ దీపిక, దాసరి రవి, కైరా గణేష్, ఏఈ సన షహీన్, అటవీ శాఖ సిబ్బంది, మెడిసిటీ వైద్యులు, నర్సులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ ఉత్సవ వేడుకకు విరాళం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం లోని రామ్ రామ్ బంజారా సంఘం ఆధ్వర్యంలో స్థానిక టిటిడి కళ్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవ వేడుక కి 30,000 వేల రూపాయల విరాళం ఉత్సవ కమిటీ సభ్యులకి అందజేసిన BRS పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్. ఈ కార్యక్రమం లో కేతావత్ హరిలాల్ నాయక్ ,నేనావత్ నాగార్జున నాయక్ రామ్ రామ్ బంజారా సంఘం కమిటీ సభ్యులు రమావత్ వంశీ , దినేష్ , సీతారాం, రమేష్ , చందు నాయక్, శశి, రవి, తిరుపతి, రాజు తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలు పోక్సో చట్టంపై విద్యార్థులకు పోలీస్ శాఖ అవగహన కార్యక్రమం

- పెదముసిడివాడ జడ్పీ పాఠశాలలో అభయ అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**




పెదముసిడివాడ జడ్పీ పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థినులకు ఎస్ఐ జి .స్ .వి . మహాలక్ష్మి ఆధ్వర్యంలో అభయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అభయ యాప్, అభయ డ్రాప్ బాక్స్ వినియోగం గురించి వివరించారు. తమకు ఎదురయ్యే వేధింపులు, సమస్యలు లేదా భద్రతకు సంబంధించిన విషయాలను భయపడకుండా అభయ డ్రాప్ బాక్స్ ద్వారా తెలియజేయవచ్చని అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలు, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, బాలికలపై వేధింపులు, సైబర్ భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందాలని ఎస్ఐ జి .స్ .వి . మహాలక్ష్మి సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 150మంది విద్యార్థినులు, పాఠశాల అధ్యాపకులు మరియు జీఎంస్కులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ మొక్కల పంపిణీ

- దేవరకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవం
- 90 వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.. మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ ఖిల్లా వద్ద దేవరకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 50 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో 90,000 మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటాల్సిన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి, ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేయడంతో పాటు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే మొక్కలు నాటాల్సి ఉన్నప్పటికీ ఎల్‌నినో ప్రభావం కారణంగా కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. ఇకపై దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను మున్సిపాలిటీతో పాటు ఆయా వార్డుల ప్రజలు కూడా తీసుకోవాలని, మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఏ. సంజీవయ్య, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, పర్యావరణ పరిరక్షణ అధికారి శక్రు నాయక్, ఏఈ రాజు, అర్చన, రాకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ గౌడ్, టీఎంసీ జగమంతు, వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రుద్ర బాబు చికిత్సకు ఆర్థిక సాయం

- వెన్నలపాలెం మాజీ సర్పంచ్ వెన్నెల అప్పారావు

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రమైన. వెన్నెల పాలెం గ్రామంలో వెన్నెల బాలాజీ కుమారుడు వెన్నెల రుద్ర బాబుకి శస్త్రచికిత్స బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స కోసం భారీగా ఆర్థిక సహాయం అవసరమైన నేపథ్యంలో పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వెన్నెలపాలెం మాజీ సర్పంచ్ వెన్నెల అప్పారావు ఆధ్వర్యంలో గ్రామ వైస్సార్సీపీ శ్రేణులు బాలాజీ కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి రుద్ర బాబు చికిత్సకు తమ వంతు సహాయంగా రూ.1,01,116 నగదును బాలాజీ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారి రుద్ర బాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పైలా సత్యనారాయణ, వెన్నెల సింహాద్రి, పైలా రేగారావు, కఠారి నాయుడు, బండారు నాయుడు, మాసవరపు ముత్యాలనాయుడు, మాసవరపు దేముడు నాయుడు, పైల సన్యాసిరావు, దుంగల సోమునాయుడు, శిరపురపు హరి, నాగిరెడ్డి సూర్యనారాయణ, చుక్క దామోదర రావు, మాసవరపు నానాజీ తదితరులు పాల్గొన్నారు.




# ఆరోగ్యమే పిల్లల భవిష్యత్తుకు అసలైన పునాది

- పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
- జ్వరం నుంచి కోలుకుంటున్న చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి

**జయభేరి, పరవాడ:**

ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో పలువురు చిన్నారులు జ్వరం బారినపడి, ఇప్పుడిప్పుడే కోలుకుని పాఠశాలలకు హాజరవుతున్నందున తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని వాడచీపురుపల్లి ప్రాంతంలో నిర్వహించిన ఏడిఎన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కస్పాండెంట్ అక్కివరపు ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు.జ్వరం తగ్గిన వెంటనే పిల్లలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చారని భావించకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా జ్వరం నుంచి కోలుకుంటున్న పిల్లల జీర్ణవ్యవస్థ పూర్తిగా కుదుటపడే వరకు కనీసం వారం రోజుల పాటు క్యారేజ్‌లో భోజనం పరిమితంగా పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు అనారోగ్యం నుంచి కోలుకుంటున్న సమయంలో ఎక్కువ ఆహారం తీసుకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, పాఠశాలలో భోజనం మొత్తం తినాలని పిల్లలపై ఒత్తిడి చేయకుండా వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.అలాగే నీటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. పిల్లలకు ఇచ్చే తాగునీటిని బాగా కాచి, వడకట్టి, గోరువెచ్చగా ఉన్న నీటిని వాటర్ బాటిళ్లలో పంపించాలని సూచించారు.పిల్లలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని పాఠశాలలకు హాజరు కావాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలకు, తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎన్ టి పి సి బూడిద నుండి పరిసర గ్రామాలను కాపాడండి



**జయభేరి, పరవాడ:**

మండలంలో కలపాక, మూల స్వయంవరం, స్వయంవరం గ్రామాల్లో నిత్యం ఎన్టిపిసి బూడిది చెరువు నుండి బూడిది ఎగిసి పడడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్య పరిష్కరించడానికి ఎన్టిపిసి యాజమాన్యం చర్యలు చేపట్టాలని ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న ఎన్టిపిసి యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని సిఐటియు నాయకులు గని శెట్టి సత్యనారాయణ మంగళవారం పరవాడలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్టిపిసి యాజమాన్యం కలపాక గ్రామంలో బూడిద ఎగిరి పడుతున్న ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోవడంలేదని నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గని శెట్టి మండిపడ్డారు. హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం ఒకవైపు ఎన్టీపీసీ బూడిది కాలుష్యంతో గ్రామం పూర్తిగా కాలుష్యం అయిందని దీన్ని నివారించడానికి జిల్లా అధికారి యంత్రాంగం చర్యలు చేపట్టాలని గని శెట్టి కోరారు.

# నాలుగు దేశాల జీడీపీ కంటే..
## ఇండియన్ బిజినెస్ మ్యాన్ ఆదాయమే ఎక్కువ

**జయభేరి, ముంబై, ఆగస్టు 25 :**

భారత్‌లోని అత్యంత ధనిక కుటుంబాల జాబితా వెలువడింది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్‌లో భారత కుబేరుల జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మొదటి స్థానంలో అంబానీ కుటుంబం, రెండో స్థానంలో అదానీ కుటుంబం ఉన్నాయి.ఈ జాబితా ప్రకారం, భారత్2లోని టాప్ 10 ధనిక వ్యాపార కుటుంబాల మొత్తం సంపదను కలిపితే 70.5 లక్షల కోట్లు అవుతుంది. లిస్టులోని టాప్ 300 కుటుంబాల మొత్తం సంపద విలువ 138 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో ఒక్క అంబానీ కుటుంబం వద్దే 25.8 లక్షల కోట్ల రూపాయల ఆస్తి ఉంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ ఉన్నారు. వారి సంపద విలువ 19.6లక్షల కోట్ల రూపాయలు. 138 లక్షల కోట్ల మొత్తాన్ని ఒక దేశ జీడీపీగా పరిగణిస్తే, అది ప్రపంచంలో 18వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. ఈ సంపద సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల మొత్తం జీడీపీ కంటే ఎక్కువ.202526 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామమాత్ర జీడీపీ 3.92 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు 328 లక్షల కోట్లు)గా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఏప్రిల్ 2026 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదిక ఆధారంగా ప్రభుత్వం 2026 ఆగస్టులో ఈ సమాచారం ఇచ్చింది. ఈ విలువతో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 138 లక్షల కోట్ల రూపాయల మొత్తం ద్వారా అనేక పెద్ద మైలురాళ్లను సాధించవచ్చు. ఈ భారీ మొత్తంతో ఒక్కో నగరానికి 30 వేల కోట్ల రూపాయల చొప్పున 100 కొత్త స్మార్ట్ సిటీస్ నిర్మించవచ్చు. వీటిలో 100 శాతం అండర్‌గ్రౌండ్ విద్యుత్ వాటర్ పైప్ లైన్లు, AI పవర్డ్ ట్రాఫిక్ కంట్రోల్, మోడ్రన్ డ్రైనేజ్ సిస్టమ్ ఉంటాయి.
ఒక్కో ఆసుపత్రికి రూ. 500 కోట్ల ఖర్చుతో ఢిల్లీ ఎయిమ్స్ తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో 5000 భారీ ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు. ఒక్కో స్కూలుకు 20 కోట్ల రూపాయల ఖర్చుతో 50000 హైటెక్ పాఠశాలలు నిర్మించవచ్చు. అందులో అత్యుత్తమ అంతర్జాతీయ స్థాయి సైన్స్, రోబోటిక్స్ ల్యాబ్స్, డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్స్, పెద్ద ప్లేగ్రౌండ్లు వంటి అనేక సౌకర్యాలు కల్పించవచ్చు.
38 లక్షల కోట్ల రూపాయలతో ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో 25000 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్‌వేలు వేయవచ్చు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు దేశంలోని ప్రతి ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కలుపుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ రెండింతల వేగంతో జరుగుతుంది. ఈ మొత్తాన్ని భారత మొత్తం జనాభాలో (సుమారు 140 కోట్ల మంది) సమానంగా పంచితే, దేశంలో ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతాలో 1 లక్ష రూపాయలు ఉంటాయి.
ముకేష్ అంబానీ ఇల్లు యాంటిలియా ప్రపంచంలో అత్యంత ఖరీదైన ఇళ్లలో ఒకటి. ఈ డబ్బుతో యాంటిలియా వంటి 10000 లగ్జరీ ఇళ్లు నిర్మించవచ్చు. ఈ భారీ మొత్తంతో 7000 రఫేల్ జెట్లు కొనుగోలు చేయవచ్చు.
ప్రపంచంలో అతిపెద్ద బంగారు నిల్వలు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వద్ద ఉండగా.. ఈ డబ్బుతో అంతర్జాతీయ మార్కెట్ నుంచి లక్షల కిలోల బంగారం కొనుగోలు చేయవచ్చు.








**టాప్ 5 వ్యాపార కుటుంబాలు ఇవే..**

హురున్ ఇండియా రిపోర్ట్ ప్రకారం, భారత్‌లోని అత్యంత ధనిక వ్యాపార కుటుంబాల ప్రస్తుత ఆస్తుల వివరాలు ఇక్కడ అందిస్తున్నాం.

**ర్యాంక్ బిజినెస్ ఫ్యామిలీ నెట్‌వర్త్.. కంపెనీ**

1 అంబానీ కుటుంబం రూ. 25.8 లక్షల కోట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్
2 అదానీ కుటుంబం రూ. 19.6లక్షల కోట్లు అదానీ గ్రూప్
3 సునీల్ భారతి మిట్టల్ రూ. 12.1 లక్షల కోట్లు భారతి ఎంటర్‌ప్రైజెస్
4 కుమార్ మంగళం బిర్లా రూ. 8.14 లక్షల కోట్లు ఆదిత్య బిర్లా గ్రూప్
5 జిందాల్ కుటుంబం రూ. 8.02 లక్షల కోట్లు ఓపీ జిందాల్ గ్రూప్..

అదానీ కుటుంబం, సునీల్ భారతి మిట్టల్ కుటుంబం కాకుండా దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించిన మరికొంతమంది మొదటి తరం వ్యాపార కుటుంబాలు ఉన్నాయి. దిలీప్ సంఘ్వీ కుటుంబం రూ.4.55 లక్షల కోట్ల ఆస్తితో సన్ ఫార్మా దిలీప్ సంఘ్వీ కుటుంబం మొదటి తరం ధనవంతుల్లో మూడో స్థానంలో నిలిచింది. పూనావాలా కుటుంబం రూ.2.98 లక్షల కోట్ల ఆస్తి విలువతో సీరం ఇన్‌స్టిట్యూట్ పూనావాలా కుటుంబం కూడా జాబితాలో చోటు దక్కించుకుంది. రాధాకిషన్ దమానీ కుటుంబం రూ.2.86 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో అవెన్యూ సూపర్‌మార్ట్స్ వ్యవస్థాపకుడు రాధాకిషన్ దమానీ ఈ జాబితాలో ఉన్నారు.



## రాష్ట్ర గిరిజన సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎన్నికైన

**జయభేరి, దేవరకొండ :**

మంగళవారం రోజు హైదరాబాదు సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్ లో తెలంగాణ గిరిజన సర్పంచ్ సంఘం రాష్ట్ర ఆవిర్భావ సదస్సులో దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ని రాష్ట్ర అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు (వర్కింగ్ ప్రెసిడెంట్) గా వారిని నియమించారు. అనంతరం కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజన సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్లో బంజారా సామాజిక వర్గానికి చెందిన సీనియర్ శాసనసభ్యులలో ఒకరికి క్యాబినెట్ మినిస్టర్ గా అవకాశం కల్పించాలని వారు అన్నారు.గిరిజన గ్రామ పంచాయతీ లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని,సర్పంచ్ ల గౌరవ వేతనాన్ని 30 వేలకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఘనంగా టైలరింగ్ సర్టిఫికెట్ల పంపిణీ




**జయభేరి, దేవరకొండ :**

విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు టైలరింగ్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా RTIAS రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ హాజరై, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు చేరిపల్లి భార్గవి, బెల్లి శంకరమ్మ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో నైపుణ్యం సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాషా చౌహాన్, జి. నిహారిక, ఎన్. శాంతి, కె. కవిత తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్




**జయభేరి, చింతపల్లి :**

పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలు,యువత, మహిళలు మరియు గ్రామ సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అమె అన్నారు. గ్రామంలో పచ్చదనం పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ప్రజలకు సూచించారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారి మండల హాలకుందిలోని సుజ్లాన్ యార్డును సందర్శించనున్న లోకేశ్

**జయభేరి, అనంతపురం, ఆగస్టు 25 :**

ఏపీ మంత్రి నారా లోకేశ్ కర్ణాటకలోని బళ్లారిలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం బళ్లారిలోని జిందాల్ విజయ్‌నగర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఆయనకు కర్ణాటక మంత్రి నాగేంద్ర, ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్‌లతో పాటు టీడీపీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తన పర్యటన సందర్భంగా బళ్లారి మండలం హాలకుందిలోని సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును సందర్శించనున్నారు. అనంతరం, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు సుజ్లాన్ 'S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను అధికారికంగా ప్రారంభిస్తారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో 1,325 మెగావాట్ల సామర్థ్యం గల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.




## గంగాపురం లక్ష్మణ్ మృతి చాలా బాధాకరం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన గంగాపురం లక్ష్మణ్ మృతి చాలా బాధాకరమని BRS పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ అన్నారు. లక్ష్మణ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు అనంతరం గంగాపురం లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఆయన వెంట కేతావత్ హరిలాల్ నాయక్, యండి ఖాజా, నేనావత్ నాగార్జున నాయక్ , యండి ఫిరోజ్ ,చొల్లేటి మణి , సంకోజు మణి(రిపోర్టర్) తదితరులు ఉన్నారు.

## మామిడ్యాలలో రేషన్ బియ్యం పంపిణీలో కోతలు..

- బీజేపీ నాయకుడి ఆరోపణలు



**జయభేరి, ములుగు, ఆగస్టు 25 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా, మామిడ్యాల గ్రామంలో రేషన్ డీలర్లు తమ ఇష్టానుసారంగా బియ్యంలో కోతలు విధిస్తున్నారని బీజేపీ నాయకుడు నరేందర్ ఆరోపించారు.సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామపంచాయతీ పరిధిలో ఒక్కో రేషన్ కార్డుపై రెండు నుంచి మూడు కిలోల వరకు బియ్యాన్ని తగ్గించి పంపిణీ చేస్తున్నారని ఆయన తెలిపారు. దీనిపై వాట్సాప్ గ్రూపులో "కిలో రేషన్ బియ్యం ఎందుకు కట్ చేస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ పోస్ట్ చేసినందుకు తనను గ్రూప్ నుంచి తొలగించారని నరేందర్ ఆరోపించారు.రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న కోతలపై అధికారులు స్పందించి విచారణ చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన పూర్తి పరిమాణంలో బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని నరేందర్ కోరారు.

## కారు డిక్కీలో మృతదేహం మిస్టరీ వీడింది..

- 'ప్రియుడే హంతకుడు'..
- మృతురాలి తండ్రి ప్రోద్బలంతోనే హత్య జరిగిందా?

**జయభేరి, వరంగల్ :**



కారు డిక్కీలో మూటకట్టి ఉంచిన మహిళ మృతదేహం దొరికిన కేసులో మృతురాలి ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ కమిషనరేట్ పోలీసులు తెలిపారు. 'ఈ హత్యను పరోక్షంగా ప్రోత్సహించిన మృతురాలి తండ్రి' పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు.
'మృతురాలి వేధింపుల నుంచి తప్పించుకోవడానికి ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని నిందితులిద్దరూ నిర్ణయం తీసుకున్నారు' అని కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి 'బీబీసీ'తో చెప్పారు. ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడు.. ఆ మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నాల్లో ఉండగానే విచారణలో దొరికారని ఏసీపీ పేర్కొన్నారు. వరంగల్ పోలీసులు, స్థానికులు కొందరు బీబీసీకి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆగస్టు 21న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి బస్టాండ్ సమీపంలో పార్క్ చేసిన కారులో నుంచి కుళ్లిన వాసన రావడంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. 'పంచాయతీ వార్డు మెంబర్ ఒకరు ఇచ్చిన సమాచారంతో కారు దగ్గరికి వెళ్లి చూశాం. దుర్వాసన వస్తుండటం గమనించాం. చుట్టుపక్కల ఎవరూ కనిపించలేదు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి వజ్జేపల్లి శ్రీనివాస్ బీబీసీతో చెప్పారు.

**నాలుగు రోజులు కారులోనే..**

కార్యదర్శి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా ఆ కారు యజమాని దామెర గ్రామానికి చెందిన సురేందర్‌గా గుర్తించారు. అయితే కొంతకాలం క్రితం రూ. 2 లక్షల అప్పుకోసం ఎల్కతుర్తికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి సమ్మిరెడ్డి కుటుంబానికి సురేందర్ తన కారును తాకట్టు పెట్టినట్టు, ప్రస్తుతం ఆ కారును ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఆయన రెండో కొడుకు యడెల్లి వినోద్ కుమార్ వాడుతున్నట్టు దర్యాప్తులో తేలింది. 'నిందితుడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కారు యజమాని నుంచి మరో తాళం తీసుకుని తెరిచి చూస్తే బెడ్ షీట్‌లలో చుట్టిఉన్న మహిళ మృతదేహం కనిపించింది. కారు ఫ్రంట్ సీట్‌లో దొరికిన ఆధార్ కార్డ్ ఆధారంగా మృతురాలు పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీకి చెందిన అంకతి మానస(35)గా గుర్తించాం. ఆతర్వాత విచారణలో నిందితుడు నేరంఅంగీకరించాడు' అని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఇది బయటి వ్యక్తుల పని అయుంటుందని, ఎక్కడో హత్య చేసి శవాన్ని ఇక్కడ వదిలేసివెళ్లి ఉంటారని మొదట భావించామని ఎల్కతుర్తి సర్పంచ్ మునిగడప లావణ్య బీబీసీతో అన్నారు. 'నిందితుడు తన ఇంటికి కేవలం పది మీటర్ల దూరంలో కారులో శవాన్ని దాచే ధైర్యం చేస్తాడని ఊహించలేదు. కారులో నుంచి వస్తున్న దుర్వాసనపై ప్రశ్నిస్తే.. డిక్కీలో రెండు రోజుల కింద నాన్ వెజ్ ఐటమ్ పెట్టానని, అది కుళ్లిపోయి ఉంటుందని సమాధానం ఇచ్చారు' అని సర్పంచ్ లావణ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 18న కరీంనగర్‌లో ఈ హత్య జరిగింది.



**ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు**

నిందితుడికి, మృతురాలికి చిన్నప్పటి నుంచే పరిచయమని, ఇద్దరూ క్లాస్‌మేట్స్ అని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. 'ఇద్దరి తండ్రులూ సింగరేణి ఉద్యోగులే. గోదావరిఖని ప్రాంతంలోని బొగ్గుగనుల్లో పనిచేస్తూ, సమీపంలోని సెంటినరీ కాలనీలో నివసించేవారు. నిందితుడు వినోద్ తండ్రి సమ్మిరెడ్డి తన రిటైర్మెంట్ తర్వాత స్వగ్రామం ఎల్కతుర్తిలో సెటిల్ అయ్యారు' అని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. 'మానసకు రెండు వివాహాలు జరిగాయి. ప్రస్తుతం రెండో భర్తతో విడాకుల కేసు కోర్టులో ఉంది. ఆమె తల్లిదండ్రుల వద్దే సెంటినరీ కాలనీలో ఉంటున్నారు. మరోవైపు వినోద్ ఇంజనీరింగ్ చదువును మధ్యలో ఆపేసి, ప్రస్తుతం కరీంనగర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఇటీవల కాలంలో మానస, వినోద్‌ల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తరచూ సెంటినరీ కాలనీ నుంచి కరీంనగర్‌లోని వినోద్ రూమ్‌కు వచ్చివెళ్లేది. మానస వైవాహిక జీవితం, వ్యక్తిగత ప్రవర్తనతో (చెప్పినట్టు వినకపోవడం, తల్లిదండ్రులపై భౌతిక దాడి చేయడం) ఆమె తల్లిదండ్రులు ఇబ్బందిపడ్డారని మా విచారణలో తెలిసింది. మరోవైపు పెళ్లి కోసం మానస తనపై చేస్తున్న ఒత్తిడిని ఆమె తండ్రి రాజేశంతో పంచుకునేవాడు వినోద్. ఈ క్రమంలో వారిద్దరూ మానసను అడ్డు తొలగించుకోకపోతే సమస్యలు తప్పవని అనుకున్నారు. మానస తండ్రి నుంచి కూడా మద్దతు దొరకడంతో ఆగస్టు 18న అర్ధరాత్రి కరీంనగర్‌లోని తన రూమ్‌లో మానసను హత్య చేశాడు వినోద్. తర్వాత తాను వాడుతున్న కారు డిక్కీలో శవాన్ని తీసుకుని సుమారు 70కిలోమీటర్లు ప్రయాణించి తన స్వగ్రామం ఎల్కతుర్తిలో తన ఇంటికి సమీపంలో పార్క్ చేశాడు' అని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వివరించారు. 'హత్య చేశాక శవాన్ని ఏం చేయాలో తెలియక వినోద్ అయోమయంలో పడ్డాడు. చివరకు తమ ఇంటి పొలంలో పాతిపెట్టాలని అనుకూలమైన సమయం కోసం చూశాడు. ఈ క్రమంలో ఆగస్టు 18 నుంచి 21 వరకు సుమారు నాలుగు రోజు కారు డిక్కీలోనే మానస శవం ఉండిపోయింది. చివరకు విచారణలో పట్టుబడ్డాడు' అని పోలీసులు తెలిపారు. ఈ కేసు అంశంపై వినోద్ కుటుంబ సభ్యులు ఒకరు బీబీసీతో మాట్లాడుతూ... 'ఇలాంటిది మా కుటుంబంలో జరుగుతుందని ఊహించలేదు. ఇంకేం మాట్లాడలేం' అని అన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఒకసారి విచారణకు వచ్చిన మానస తండ్రి రాజేశం ఆ తర్వాత తన పేరు బయటకు వస్తుందన్న అనుమానంతో ప్రస్తుతం పరారీలో ఉన్నారని, హత్య కరీంనగర్‌లో జరిగినందున తదుపరి కేసు విచారణ కరీంనగర్ వన్ టౌన్‌కు బదిలీ చేశామని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.



రాకింగ్ స్టార్ యశ్ నటించిన లేటెస్ట్ సినిమా 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్అప్స్'. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా విడుదలయ్యింది. బుధవారం (ఆగస్టు 26) ఈ సినిమా పెద్ద ఎత్తున థియేటర్లలో రిలీజ్ అయ్యింది. కాగా ఈ సినిమా ప్రీమియర్స్ మొదలయ్యాయి. భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్ లోనూ ఈ సినిమా రిలీజ్ కానుండడం విశేషం. దీంతో మొదటి రోజు టాక్సిక్ సినిమాకు వచ్చే కలెక్షన్లు, రికార్డులపై అప్పుడే చర్చ జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున టాక్సిక్ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇక సినిమా ప్రీమియర్స్ చూసిన ఆడియన్స్ సినిమాపై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియాలో తెలుపుతున్నారు. సినిమా అదిరిపోయిందని, యష్ ఇరగదీశాడని కొందరు సోషల్ మీడియాలో తెలుపుతున్నారు. ఇంకొందరు మరోలా తమ అభిప్రాయాన్ని తెలుపుతున్నారు. ఈ మూవీలో యష్ స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉందని.. యష్ రెండు క్యారెక్టర్స్ లో తన నటనతో మైండ్ బ్లాంక్ చేశాడని అంటున్నారు.



## 'స్పిరిట్'కు A సర్టిఫికెట్ ఖాయమా?

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్పిరిట్' మరోసారి టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉండగా.. తాజాగా సందీప్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు ఆ అంచనాలను మరింత పెంచేశాయి.తాజాగా జరిగిన 'రోమాంచకం' మూవీ ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో 'స్పిరిట్' సెన్సార్ సర్టిఫికేషన్‌పై సందీప్ రెడ్డి వంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ సినిమాకు 'A' సర్టిఫికెట్ వచ్చే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేయడంతో సోషల్ మీడియాలో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సందీప్ రెడ్డి వంగా అంటేనే ఎలాంటి కాంప్రమైజ్ లేకుండా తన కథను తెరపై చూపించే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' చిత్రాలతో తనదైన మేకింగ్ స్టైల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ముఖ్యంగా పాత్రల్లోని తీవ్ర భావోద్వేగాలు, రా నేచర్, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్స్ ఆయన సినిమాలకు ప్రధాన బలంగా నిలుస్తుంటాయి. ఇప్పుడు అదే తరహాలో కాకుండా మరింత ఇంటెన్స్‌గా 'స్పిరిట్'ను తెరకెక్కించబోతున్నారనే చర్చ జరుగుతోంది. కథకు అవసరమైన యాక్షన్, ఎమోషన్స్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సందీప్ రెడ్డి వంగా తనదైన శైలిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సినిమా కేవలం సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా.. ప్రభాస్ కెరీర్‌లో మరో విభిన్నమైన చిత్రంగా నిలిచే అవకాశాలున్నాయని అభిమానులు భావిస్తున్నారు. 'స్పిరిట్'లో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. భారీ యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషనల్ డ్రామా కూడా ఈ కథలో కీలకంగా ఉండబోతుందని తెలుస్తోంది. ప్రభాస్ మాస్ ఇమేజ్‌కు, సందీప్ రెడ్డి వంగా రా మేకింగ్ స్టైల్‌కు కలయికగా వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ముఖ్యంగా ప్రభాస్‌ను సందీప్ రెడ్డి వంగా ఎలా ప్రజెంట్ చేయబోతున్నారు? ఆయన పాత్రలో ఎలాంటి కొత్త కోణాలు చూపించబోతున్నారు? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాను 2027 మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం పనిచేస్తున్నట్లు సమాచారం.

## నాగార్జున 100వ సినిమాపై భారీ అప్డేట్.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్..!



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో భారీ చర్చకు దారితీస్తోంది. తాత్కాలికంగా 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు తమిళ దర్శకుడు రా. కార్తిక్ దర్శకత్వం వహిస్తున్నారు. నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం నాగార్జున పుట్టినరోజును పురస్కరించుకుని ఆగస్టు 29న 'కింగ్ 100' ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ గ్లింప్స్‌తో పాటు సినిమా అసలు టైటిల్‌ను కూడా ప్రకటించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, సినిమా విడుదల తేదీపై కూడా కీలక ప్రకటన రావచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్ 100' ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నప్పటికీ, కథలో ప్రధానంగా తండ్రీ-కూతుళ్ల మధ్య ఉండే భావోద్వేగ బంధం కీలకంగా ఉండనున్నట్లు సమాచారం. అదే సమయంలో సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగే వ్యక్తి ప్రయాణాన్ని చూపించే రాగ్స్ టు రిచెస్ అంశం కూడా కథలో ప్రధాన ఆకర్షణగా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్, కుటుంబ భావోద్వేగాలు, ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు ఒక వ్యక్తి జీవిత ప్రయాణాన్ని మిళితం చేసి దర్శకుడు రా. కార్తిక్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నాగార్జునకు ఇది ఆయన గత చిత్రాలకు భిన్నమైన పాత్రగా నిలవనుందనే అంచనాలు ఉన్నాయి.

## ఘనంగా "చిరంజీవి" మూవీ ప్రీ రిలీజ్



కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా "చిరంజీవి". ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. "చిరంజీవి" సినిమా ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ ఈ నెల 28న మా సినిమా రిలీజ్ కు వస్తోంది. తెలుగు ఆడియెన్స్ తెలుగు సినిమాలను చూసేందుకు ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నా. ఈ చిత్రానికి కికు అన్నీ తానై చూసుకున్నాడు. కొత్తదనం నిండిన సినిమాగా కికు "చిరంజీవి" మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు. హీరో కికు యనమల మాట్లాడుతూ మా సినిమా ఈవెంట్ కోసం టైమ్ కేటాయించి మా కోసం వచ్చిన అతిథులకు థ్యాంక్స్ చెబుతున్నాం. మా చిత్రంలో అవకాశాన్ని ముఖ్యమని భావించి పనిచేసి ఇప్పుడు ప్రమోషన్స్ కు కూడా రాని వాళ్లను చూస్తుంటే బాధగా ఉంది. మా సినిమా ప్రమోషన్ ను ఏపీలోని పలు ప్రాంతాల్లో చేశాను. అక్కడ రెస్పాన్స్ చాలా బాగా వచ్చింది. హైదరాబాద్ లో ఒక కాలేజ్ వాళ్లు మాత్రం ఈవెంట్ కు పర్మిషన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. దాంతో మాకు సమయం వృథా అయ్యింది. కొన్ని థియేటర్స్ లో మా సినిమా ఫ్లెక్సీలను తీసేసి మరో పెద్ద సినిమా ఫ్లెక్సీలు పెడుతున్నారు. అది డబ్బింగ్ మూవీ. ఆ సినిమాకు ప్రాధాన్యత ఇవ్వండి తప్పు లేదు కానీ మన స్టేట్ తెలుగు సినిమాను ఎందుకు సపోర్ట్ చేయరు అని అడుగుతున్నా. మన సినిమాలకు పక్క రాష్ట్రాల్లో ప్రాధాన్యత ఇవ్వరు, సపోర్ట్ చేయరు. ఇక్కడ తెలుగులో కూడా తెలుగు సినిమాకు సహకరించకుంటే ఎలా. ఎవరు సపోర్ట్ చేయకున్నా మేము భయపడము. మా కంటెంట్ మీద నమ్మకం ఉంది. తమ సినిమాల మీద నమ్మకం ఉన్న కొత్త వాళ్లు ఎవరైనా భయపడకుండా ఇండస్ట్రీకి రండి. మీ కంటెంట్ మిమ్మల్ని నిలబెడుతున్నా. ప్రసన్న గారు, ఛోటా కె ప్రసాద్ లాంటి వాళ్లు మా సినిమాకు ఎంతో సహకారం అందించారు. ఈ నెల 28న థియేటర్స్ లోకి వస్తున్న మా చిరంజీవి సినిమా ఒక కొత్త కాన్సెప్ట్ తో మిమ్మల్ని ఆద్యంతం ఆకట్టుకుంటుంది. అన్నారు.



## ఈ పద్ధతి ఎప్పుడు మారుతుంది?

బాలీవుడ్ కథానాయిక కృతిసనన్ నటించిన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటన వివాదాస్పదమైంది. ఓ కుక్కకు రాఖీ కడుతూ కురచ దుస్తుల్లో కనిపించడంతో సోషల్‌మీడియాలో ఆమెపై ట్రోల్స్ వెల్లువెత్తాయి. మన సంస్కృతికి విరుద్ధంగా ఆమె ప్రవర్తన ఉందని, సోదరుడికి కట్టే రాఖీని కుక్కకు కట్టడం ఏంటని నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కథానాయిక కంగనారనౌత్ సైతం కృతిసనన్ వస్త్రధారణపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళలు ధరించడానికి ఎన్నో సంప్రదాయ వస్త్రాలు ఉండగా బికినీ ధరించి రాఖీ కట్టడమేంటని కంగనా ప్రశ్నించింది. తాజాగా ఈ విమర్శలపై కృతిసనన్ స్పందించింది. మహిళలు ధరించే దుస్తులను సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆమెకున్న గౌరవానికి ముడిపెట్టే పద్ధతి ఎప్పుడు మారుతుందని ప్రశ్నించింది. 'ఫ్యాషన్ అనేది ఎన్నో ఏళ్లుగా మార్పు చెందుతున్నది. కానీ ఇప్పటికీ మహిళా గౌరవాన్ని ఆమె దుస్తుల్లోనే కొలుస్తున్నారు. పండగల ఔన్నత్యం మనం ధరించే దుస్తుల్లో ఉండదు. సం స్కృతి, సంప్రదాయాలు మహిళల హృదయాల్లో ఉంటాయి. ఆమె ధరించే దుస్తుల్లో కాదు' అని కృతిసనన్ పేర్కొన్నది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**